# మంగళసూత్రము

## జీవనప్రభాత్ (నవకళాసమితి)

నిశ్చలంగా శిలాప్రతిమవలె కూర్చుండివున్న పతిని సమీపించింది 'కాంత'.

'ఇదిగో ఇలాచూడండి—'

యోగసమాధిలోవున్న 'మూర్తి' కళ్లు తెరచాడు. ప్రసన్నవదనంతో తనయెదుట నిలబడివున్న ఆ దేవీ మూర్తిని చూచాడు...అతని శరీరం పులకరించసాగింది. భావశూన్యంగా ఆమె తేజోమయ నయనాలలోనికి చూడసాగాడు.

'ఈ పసుపుకొమ్ము నా మెడలోకట్టి—నా మంగళసూత్రాలు తీసుకువెళ్లండి.'

చిరునవ్వు ఆమె ముఖంలో తాండవిస్తోంది, కాని ఆమె మాటలలో గొప్ప ఆవేదన స్ఫురిస్తోంది.

'ఆఁ—ఏమిటీ?' అతని కరకుహృదయం అతనికి తెలియకుండానే మెత్తగా మాట్లాడింది.

'మీ చేతులతో మీరే ఈ పసుపుకొమ్ము నాగళసూత్రంగా కట్టి, నా మంగళసూత్రాలు తీసుగెళ్లండి...అవి తప్పితే వేరులేవు!'

ఆమాటలంటూంటే—ఒక దేవత తన అనంత త్యాగరూపాన్ని చూపడానికి స్వర్గధామమునుండి దిగి వచ్చిందా—అనిపిస్తోంది. మూర్తి లేచినిలుచుని ఆమెను సమీపించాడు. ఆమె నిశ్చలంగా, చిరునవ్వుతో—అతని కండ్లలోనికి చూస్తోంది. ఆ చూపులు అతన్ని కలచివేశాయి. ఆమె మెడదాకా వెళ్లిన అతనిచేతులు—వెనక్కు జంకాయి...అతని కళ్లనీళ్లు తిరిగాయి—

'అయ్యో! కాంతా!...నీ త్యాగానికి హద్దులేదా? ఇంకా ఆ మంగళసూత్రాలు—ఆ మిగిలిన రెండు సూత్రాలుకూడా—తీసుగువెళ్లిపోనా?...నీ నగలన్నీ వొలుచుగువెళ్లాను—ఇంకా ఎంతని నాకోసం త్యాగం చేస్తావు కాంతా?'

'మీకోసం సర్వమూ త్యాగంచేస్తా—ఈ శరీరమూ, ఈ జీవమూ,—అన్నీ మీవే అయినప్పుడు ఈ వస్తువులుమాత్రం నావనా?—'

అతని కళ్ళ జలజల నీళ్లు కారుతున్నాయి...ఆమెలో వున్న మహత్తరశక్తి అతనికి కనపడసాగింది. ఆమె ముఖంలోని పవిత్రజ్యోతి ప్రకాశించసాగింది...అతనొక్కసారి వెలుగులోని కీడ్వొబడ్డాడు—

ఆమె దేవత; తను రాక్షసుడు. ఆమె దయామయ, కోమలహృదయం; తను కర్కశపాషాణం. ఆమె త్యాగమూర్తి; తను స్వార్థపరుడు. ఆమె అమరస్త్రీ; తను కేవల మానవుడు!...ఆమె పాదాలదగ్గర నిలుచుని ప్రార్థించుకునే యందుకుకూడా తగడు. అతని నిజస్వరూపం బయలుపడసాగింది...ఆవేశంతో అన్నాడు, 'కాంతా! అంతపని చెయ్యలేను...నా యీ చేతులతో కట్టిన సూత్రం ఈ చేతులతోనే విప్పలేను...అయ్యో! నే క్రూరుణ్ణి—నిన్ను హింసపెట్టాను...'—వాపోవసాగాడు.

'కాంతా! నీ మెడలో నే సూత్రం కడతం నిన్ను దుఃఖపెట్టడానికే కాబోలు—నన్ను కట్టుగుని ఏంసుఖమనుభవించావు? నన్నెందుకు కట్టుకున్నావు? అయ్యో! నీకు నా సంబంధమేనా తప్పిపోలేదు...ఈపాటికి ఎంత సుఖం అనుభవిస్తోవుండేదానివో కదా—'

కాంత పతి నోటిదగ్గర చెయ్యిపెట్టింది. 'ఆ మాటలు తలపెట్టకండి—ఇంక అనవని ఒట్టుపెట్టుకోనండి...మీతోటి కష్టాలే అయినా నాకు వేయిసుఖాలు!'

ఆమె తన మెడలోవున్న మంగళసూత్రాలు తీసి అతని చేతిలో పెట్టింది—'ఇంతకంటే—ఈ దీనురాలు—ఇవ్వలేదు...'

అతని శరీరం గజగజ వణికిపోయింది. ఆ నగను ముట్టుకోనడంతోటే అతనిహృదయంలో ఒకవిధమయిన బాధ బయలుదేరింది. అతని పూర్వపు చర్యలన్నీ స్మృతికి రాసాగేయి—

* * * *

కాంతకి అనేక సంబంధాలు వచ్చేయి. ఎందరో గొప్పగొప్పవారు ఆమె చేతిని యాచించారు. కాని ఆమె మూర్తిని కోరుకుంది—మూర్తి ఆమెకోసం ఒకప్పుడు తపస్సుచేసినవాడే—ఇద్దరికీ వివాహం జరిగింది.

గురుసాక్షిగా, పితృసాక్షిగా, అగ్నిసాక్షిగా—ఆత్మసాక్షిగా...ఆమె గళసీమలో మంగళసూత్రము కట్టి—ఆమెను అర్ధాంగిగా స్వీకరించాడు.

వేదమంత్రాలతో అనేక శపథాలు చేసేడు—ఆమెను సుఖపెడతాననీ, ఆమెను ఏక్షణంలోనూ విడువననీ, కష్టసుఖాలలో ఆమెకు తోడునీడ అవుతాననీ...ఇంకా ఏవేవో అనేక బాసలుచేసి ఆమెను తన గృహలక్ష్మిగా తెచ్చుకున్నాడు...

ఆ బాసలన్నీ యేమయినట్లు? ఒక్కక్షణం ఆమెను సుఖపెట్టలేదు—ఒక్కసారయినా ఆమెను ప్రేమతో పిలువలేదు—

ఈరోజున తను నానాబాధలూ పడుతున్నాడు—భౌతికంగా నైతికంగా తను భగ్నహృదయుడయ్యేడు. ఈ క్షణంవరకూ ఆమె తన ధర్మపత్ని అన్న విషయం మరచిపోయాడు. తన దురభ్యాసాలన్నిటికీ ధనమవసరమైనప్పుడు ఆమె పీకమీద కూర్చునేవాడు......తను చేసిన అన్యాయాలకన్నిటికీ ఆమె చేసిన ప్రతిక్రియ—?

తన శరీరంమీదనున్న వస్తువులన్నీ ఇచ్చింది—తన జీవితమంతా త్యాగంచేసింది...ఒక్కమాటేనా మాట్లాడకుండా! ఎందుకు? తను ప్రేమించిన భర్త సుఖంకోసం?

అంత ఎక్కువగా ప్రేమించిన ఆమె ప్రేమను—నిర్లక్ష్యంగా చూచాడు—త్రోసిపారవేశాడు

అన్నివిధాలా ఆమెను అన్యాయంచేసాడు;—ఆమెను మోసపుచ్చాడు; దుఃఖపెట్టాడు; పీడించి పిప్పిచేసాడు!...అంతటితో పూరుకోక ఈరోజున మంగళసూత్రానికని వచ్చాడు—

తను తిండిలేక బాధపడుతున్నాడు; ఆమె ఉపవాసాలతో గడపుతోంది...తిరిగి తన దురభ్యాసాలకు ఆమెను పీడించవచ్చాడు నేడు!

* * * *

అతనిలోవున్న అగ్నిలాంటి గుణం ఒక్కసారి కంపించిపోయింది. ఆమె నయనాల తేజస్సుచేత హిమవంతమయింది...తను ఇప్పుడనుభవిస్తున్న దరిద్రబాధను మరచిపోయాడు—అతడు దరిద్రుడుకాడు. అతని భార్య ఒక మహాలక్ష్మి!...ఇంతలోనూ అతనిచేతిలోవున్న మంగళసూత్రాలు కనపడ్డాయి. అతను విపరీతంగా కంపించి వాపోవసాగాడు—దుఃఖం పొంగిపొరలి రాసాగింది.

తను మహాపరాధంచేస్తున్నాడు—తనభార్యను పసుపుకొమ్ముతో వదలుతున్నాడు. తనుండికూడా ఆమెను అనాధనుచేస్తున్నాడు—తనచేత్తో కట్టిన సూత్రాన్ని తానే తీసివేస్తున్నాడు...

'కాంతా! ఇంతపనిచెయ్యలేను—అయ్యో నీగుణం తెలిసికోలేని మూర్ఖుణ్ని...అన్నివిధాలా చెడిపోయేను—ఈ సూత్రం అమ్మవొద్దు—నే దరిద్రుణ్ని కాను...'

'నిజమే! మనమనస్సులు పవిత్రంగావున్నంతకాలమూ మనం దరిద్రులంకాము. కాని ఇప్పుడు దుఃఖించకండి...ఈ మంగళసూత్రాలు తీసుకెళ్లి అమ్మెయ్యండి—'

'కాంతా! ఇంకా నాకళ్లు మూసుకుపోయే వున్నాయనుకుంటున్నావా? కాదు—మంగళసూత్రాలమ్మేసే అంతటి నిర్భాగ్యుణ్ని కాను. ఇదివరకు అంతకంటే అధమాధముణ్నయినా—ఇప్పుడుమాత్రం కాను...అయ్యో చూస్తూ చూస్తూ నిన్ను నాచేతులతోనే గంగలో దింపలేను—' అని విలపించసాగాడు.

ఆమె భర్తకన్నీరు తుడువసాగింది. 'ఎప్పుడూ మనం కష్టాలే అనుభవిస్తామా? ఎప్పుడూ అంధకారంలోనే వుంటామా?...ఇది ఒక చిన్నెమాత్రమే. ఈ బంగారు వాటికంటే పవిత్రమయినది ఈ పసుపుకొమ్ము. ఇది నామెడలోవుంటే చాలు. మన ప్రేమసూత్రమే నా మంగళసూత్రము—'

'అయ్యో కాంతా! నన్ను కట్టుకొనటంతోటే నువ్వు వేదాంతమార్గం ప్రవేసించావు...నాతోపాటు దుఃఖాలనుకూడా కట్టుకున్నావు...ఇంక నిన్ను వదల్లేను...నన్ను రక్షించుకో! నీమీద నాకు హక్కులేదు—ఈ సూత్రాలు మళ్లీ నీమెడలో వేసుకో—కాదు. నా అంత నేనే వేస్తాను—' అంటూ భార్యమెడలో ఆ మంగళసూత్రాలు వేశాడు. 'కాంతా! ఇంతవరకూ నీప్రేమ తెలుసుకోలేకపోయాను. నువ్వు దేవతవు నన్ను వెలుగులోనికి నడిపించు. నా తప్పులకి నన్ను శిక్షించు—'

'మిమ్మల్నా? నేనా శిక్షించేదాన్ని?! అయితే ఇంక నన్ను వదలి వెళ్లకండి. నా నిజమంగళసూత్రాన్ని నామెడలోనుంచి వేరుచేయకండి...మీరే నా మంగళసూత్రం...'

'కాంతా! దరిద్రుణ్ని—దుర్మార్గుణ్ని—హింసకుణ్ని—'

'ఎన్నైనా—ఎవరైనా—మీరే నా మంగళసూత్రం—'

# వత్సరాది

శ్రీమతి పి. వి. సీతామహాలక్ష్మిగారు

సీ. ఒకవంక సింగారమొలికించ జడనిండ వేప్పూవ్వు గుదియులై విరిసియుండ
లేతనావేపాకు లిందందునల్లిన చీరగట్టిననేర్పు చిందులాడ
కీరసంతతియొక్క క్రేంకారమెల్లను చిరుగజ్జలై శోభ జెలగుచుండ
ముత్యాలవర్షంబు మున్ముందు నీరాక దెల్పుచు మోదంబు గొల్పుచుండ

గీ. నీదునాట్య సరణికిల నేర్పుమీర నింతులెల్లరు ముగ్గులనింపుచుండ
నౌర! యేతెంచితీ నాటికైన నొక్కనాడె యుండెదంచును పల్కులాడరాదె.

ఉ. ఎందునలేదు మోదమిలనింతియు చెంతను లేనిచో మనం
బెందునసౌఖ్య నెంత తను బీరముజూపదలంచినన్ మదిన్;
కాదనువారులేరు కలికాలమటంచు దలంచకమ్మరో
చెందుముసంత సంబికను జేరుము లక్ష్మివి మమ్ము బ్రోవగన్